క్లుప్తంగా

మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వెంకటాపురంలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: మహిళలకు ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ అవసరమని సీహెచ్ఓ ప్రమీల పేర్కొన్నారు. వెంకటాపురంలో ఆదివారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్ఓ మాట్లాడుతూ స్త్రీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉచిత వైద్యం, ఉచిత మందులు, వైద్యపరీక్షలు, రెఫరల్ వంటి సౌకర్యాలను అందించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది ధనలక్ష్మి, అరుణ, కిరణ్మయి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ధర్మవరం అర్బన్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని గీతా భక్తమండలి సభ్యులు దేవతా కృష్ణమూర్తి, దేవతా వెంకట నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని కళాజ్యోతిలో ఆదివారం వాల్మీకి రామాయణం క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాజ్యోతి గౌరవ సలహాదారు శింగనమల రామకృష్ణ, పిన్నూ రామకృష్ణప్రసాద్, కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు హాజరయ్యారు. దేవతా కృష్ణమూర్తి, దేవత వెంకట నాగరాజు న్యాయమూర్తులుగా వ్యవహరించారు. వాల్మీకి రామాయణం క్విజ్ పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన సాయి వాసవి, మధుర మీనాక్షి, షేక్ యాసిన్, హేమంత్, శ్రీవాణికి ముఖ్య అతిథులు చేతులమీదుగా నగదు బహుమతులు అందించారు.

అనాథలకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న సీఐ నాగేంద్ర ప్రసాద్

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఆదివారం ధర్మవరం పట్టణ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ వస్త్రదానం చేశారు. తన తల్లి స్వర్ణకుమారి ప్రథమ వర్ధంతి సందర్భంగా వస్త్రదానంతో పాటు అన్నదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపించడమే ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారీలు

రామగిరి: సమాజాన్ని సన్మార్గంలో నడిపించడమే బ్రహ్మకుమారీల ధ్యేయమని రాజయోగిని బహ్మకుమారీ సుగంధ సిస్టర్, కమల, హేమలత సిస్టర్ పేర్కొన్నారు. ఆదివారం రామగిరిలో ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధ్యానం, ఆధ్యాత్మిక బోధనలు, సామాజిక, సేవా కార్యక్రమాలు, ఆహార నియమాలు, బ్రహ్మచర్యం, ఆత్మశుద్ధి వంటి కార్యక్రమాలు సమాజంలో ఉన్నత జీవనానికి దోహదపడతాయన్నారు.

గుర్రం జాషువా, భగత్‌సింగ్‌కు నివాళి

మడకశిర: పట్టణంలోని 4వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్ర పటాలకు యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, యూటీఎఫ్ నాయకులు జోగప్ప, మాలింగప్ప, మూడ్ల గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: సాహితీ, సామాజిక మార్పుకు ఎంతో పాటు పడిన మహాకవి గుర్రం జాషువా సేవలు మరువలేనివని బహుజన చైతన్య వేదిన వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం నాయకులు గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నాగరాజు, రవి, ఆంథ్రూస్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల ప్రారంభమెన్నడో?

- నత్తనడకన సీహెచ్‌సీ అదనపు భవనాల నిర్మాణం
- అరకొర వసతులతో ఆస్పత్రి సిబ్బందికి అవస్థలు



నల్లమాడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రారంభానికి నోచుకోని అదనపు గదుల సముదాయం

నల్లమాడ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో అదనపు గదుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. అదనపు గదుల ఆరంభోత్సవం ఎన్నడో అంటూ ఇటు ఆస్పత్రి సిబ్బంది, రోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద: 30 పడకల ఆస్పత్రిగా ఉన్న సీహెచ్‌సీలో రోగులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో 2020 వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.65 కోట్ల నాబార్డు నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. నిర్ణీత గడువు 2022 ఆఖరుకు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. కాంట్రాక్టర్ అలసత్వం, పర్యవేక్షణ లోపంతో ఐదేళ్ల నుంచి అదనపు గదుల నిర్మాణం కొనసాగుతూనే ఉంది.

ఆస్పత్రిలో లభించే వైద్య సేవలు

సీహెచ్‌సీలో ఎండీ జనరల్ మెడిషన్, అనస్తీషియా, గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, పీడియాట్రిక్, దంత, ఎంబీబీఎస్‌తో వైద్యుడితో కలిపి మొత్తం ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. సర్జన్ పోస్టు ఖాళీ ఉంది. ఎక్స్‌రే, దంత, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, ఐసీటీసీ కౌన్సెలింగ్ కేంద్రం అందుబాటులో ఉన్నాయి. సాధారణ, సీజనల్ జబ్బులు మొదలుకొని సిజేరియన్ కాన్పులు కూడా వైద్యులు చేస్తున్నారు. రోజూ సరాసరి 250-300 ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. వీరికి ఇన్‌పేషెంట్లు, బాలింతలు అదనం. వైద్య సిబ్బందితో కలిపి మొత్తం 34 మంది ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు.

త్వరలోనే అందుబాటులోకి

అదనపు గదులను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మావంతు ప్రయత్నాలు చేస్తున్నాం. కాంట్రాక్టర్‌తో తరచూ మాట్లాడి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నాం. ఇటీవలే కరెంట్ వైరింగ్ పనులు చేశారు. త్వరలోనే ప్రాంభించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ బాబ్జాన్, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

అరకొర వసతులు..

ప్రస్తుతం సీహెచ్‌సీలో తగినన్ని గదులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వైద్య సిబ్బందికి విశ్రాంతి గదులు, కాన్పుల నిర్వహణకు ప్రత్యేక గదులు లేకపోవడం తదితర సమస్యలు నెలకొన్నాయి. రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేవని తెలుస్తోంది.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు గదులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆస్పత్రి సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

నిండు కుండలా చెరువు...అడవిలా ఆయకట్టు



నిండు కుండను తలపిస్తున్న ధర్మవరం చెరువు



చిట్టడవిని తలపిస్తున్న ఆయకట్టు భూములు

ధర్మవరం రూరల్: పైతట్టు కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చిత్రావతి నది ద్వారా ధర్మవరం చెరువులోకి పూర్తి స్థాయిలో నీరు చేరింది. దీంతో చెరువు నిండు కుండలా తొణికిసలాడుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండో పెద్ద చెరువుగా పేరున్న ధర్మవరం చెరువు నీటి సామర్థ్యం 370.30 క్యూబిక్ మీటర్ సామర్థ్యం. నీటి నిలువ పాయింట్ 373 (.373)టీఎంసీలు కాగా ఆయకట్టు భూమి 1922 ఎకరాలు ఉంది. ప్రస్తుతం చెరువు నిండా నీరున్నా పంట పండించుకోలేని పరిస్థితి. ఆయకట్టు మొత్తం ముళ్ల పొదలతో చిట్టడవిని తలపిస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి ఆయకట్టు భూముల్లో ముళ్ల పొదలు తొలగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆయకట్టు భూముల్లో ముళ్ల పొదలను తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు.



గుంతలో చిక్కుకున్న కారు

తవ్వారు.. వదిలేశారు!

పుట్టపర్తి టౌన్: పట్టణంలో ప్రధాన రహదారిపై ఎనుములపల్లి సంత వద్ద సీసీరోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి మధ్య తారురోడ్డు నిర్మించేందుకు రూ.2 కోట్లతో టెండర్లు పిలవగా అనంతపురానికి చెందిన జీఎస్ఆర్ కంపెనీ పనులు దక్కించుకుంది. ఎనుములపల్లి సర్కిల్ వద్ద వర్షపు నీరు నిల్వ ఉంటోందని గ్రహించిన మున్సిపల్ అధికారులు బీటీ రోడ్డు బదులుగా సీసీరోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 10 రోజుల క్రితం వర్షపునీరు ఎనుములపల్లి చెరువులోకి వెళ్లేలా పైప్‌లైన్ వేసేందుకు అధికారులు 8 అడుగుల లోతుతో గుంతలుతీసి లెవల్స్ రాలేదని నీరుపోవని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వదిలేశారు. తర్వాత పనుల గురించి పట్టించుకోవడం లేదు. ఈ దారిలోనే ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. దీంతో వివిధ పనుల కోసం వెళ్లే ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



పైప్‌లైన్ కోసం తవ్విన గుంత



సీసీ రోడ్డు కోసం బీటీ రోడ్డును తొలగించిన దృశ్యం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం 1985-90 మధ్య 6వ తరగతి నుంచి 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అనేక సంవత్సరాల తర్వాత అందరూ ఒకచోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరికొకరు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పటి గురువులు రామచంద్రారెడ్డి, శంకర్‌నారాయణరెడ్డి, గోపీనాథ్‌తో పాటు ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లమాడ: అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానిక బస్టాండ్ కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన వాణిజ్య పన్నులతో ఆంధ్ర రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, పట్టు రంగాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. వ్యవసాయం, డైరీ, ఉద్యానవన ఉత్పత్తుల ధరలు పడిపోతాయన్నారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులకు సుంకాలు పెంచి పారిశ్రామికవేత్తలకు సుంకాలు తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. ఫలితంగా సామాన్యుల జీవన పరిస్థితులు కష్టతరం అవుతాయన్నారు. ట్రంప్ అడుగులకు మడుగులొత్తే మోదీ ప్రభుత్వం లొంగుబాటును ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని, దేశ ప్రయోజనాల కోసం కలసికట్టుగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. నాయకులు మునిరాములు, గంగాద్రి, యల్లప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతా పాహిమాం

సాక్షి బృందం: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో దసరా శరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లను వివిధరూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఆలయ కమిటీలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశాయి.



ధర్మవరం దుర్గానగరలో అన్నదానం చేస్తున్న దృశ్యం



శాకంబరిగా కొత్తచెరువు పెద్దమ్మతల్లి



మహాలక్ష్మీదేవిగా అమడగూరు చౌడేశ్వరి



ధర్మవరంలో కృష్ణుడిగా లక్ష్మీచెన్నకేశవస్వామి



కదిరిలో వారాహిదేవి రూపంలో వాసవీమాత



నసనకోటలో మహాచండీగా దుర్గాదేవి



బత్తలపల్లిలో ద్రాక్షాయణిగా దుర్గామాత



మేడాపురంలో మహా చండిగా చౌడేశ్వరీదేవి

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఆదివారం ఎక్సైజ్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. హిందూపురం నుంచి కెంచనపల్లికి వెళ్లే రహదారిలో కిరికెర క్రాస్ వద్ద ఓ వ్యక్తి కర్ణాటక మద్యం కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కొల్లకుంట బ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి 8 మద్యం బాటిళ్లు, చిలమత్తూరు మండలం కొడికొండ నుంచి మోరంపల్లికి వెళ్లే రహదారిలో 6 లీటర్ల మద్యం కలిగి ఉన్న మహిళలను అరెస్ట్ చేశామన్నారు. పట్టణ, మండల, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండల పరిధిలో ఉన్న కల్లు దుకాణాలు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆదివారం తనిఖీ చేశారు.



కల్లును పరీక్షిస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు లో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం బైక్‌ను మరో బైక్ ఢీకొంది. ఘటనలో ఓ బైక్ వెనుక కూర్చుని వెళ్తున్న పట్టణానికి చెందిన ఓబులేసు కుమారుడు నితిన్(12) కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు అతడని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంతో దంపతులకు గాయాలు



గాయపడిన రమాదేవి శ్రీనివాసులు.

నల్లచెరువు: జోగన్నపేట గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు జోగన్నపేట గ్రామానికి చెందిన భార్యభర్తలు శ్రీనివాసులు, రమాదేవి వ్యక్తిగత పనులపై కదిరికి బైక్‌పై బయలు దేరారు. గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వద్దకు రాగానే మదనపల్లి వైపు నుంచి కదిరి వైపు వస్తున్న ఇన్నోవా వాహనం ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఓవర్ టాక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి 108 వాహనానికి ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీసీ ఐక్యత సభకు తరలిరండి

కనగానపల్లి: పుట్టపర్తిలో సోమవారం జరిగే బీసీల ఐక్యత సభకు మండలంలోని బీసీ నాయకులంతా తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. ఈ సభలో బీసీ సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



మణిదీప్

ధర్మవరం అర్బన్: అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. ఈనెల 25న అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన సెలక్షన్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టణానికి చెందిన విద్యార్థి మణిదీప్ శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. త్వరలో జరగబోయే అంతర్ కళాశాల కబడ్డీ పోటీలకు మణిదీప్ వెళ్లనున్నట్లు ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు అనిల్, రాజశేఖర్, పృథ్వీ తెలిపారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



వర్క్ షాపు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఉపాధి అవకాశాలను కదిరి ప్రాంత నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కోఆర్డినేటర్ మారుతి తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని వీవర్స్‌కాలనీ సమీపంలోని మాధవ గురుకులంలో యువతి యువకులకు రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సంబంధించి వర్క్ షాపు నిర్వహించారు. ఆసక్తి ఉన్నవారికి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో యూనిట్ ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీతో రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కదిరి కోఆర్డినేటర్ హేమలత, నిర్వాహకులు నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



గ్రామస్తులకు సూచనలిస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని నేలకోట, బుడ్డారెడ్డిపల్లిలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. మద్యం, జూదం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళల పట్ల గౌరవ భావంతో నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.